క్లుప్తంగా

వీఎంసీలో పీజీఆర్ఎస్



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగింది. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 9 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక -4, ఇంజినీరింగ్ -4, రెవిన్యూ -1 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉరుసు



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పాతబస్తీ పంజా సెంటర్‌లోని హజరత్ సయ్యద్(షా) మస్తాన్ వలి లోటెసోటీ మస్తాన్ బాబా 104వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకూ నిర్వహించనున్నట్లు ముజావర్ మొహమ్మద్ ఇంతియాజుద్దీన్ తెలిపారు. ముజావర్ కమిటీ ఆధ్వర్యంలో ఉరుసు మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ రాత్రి బాబా దర్బారు ప్రాంగణంలో 10 గంటలకు పకీర్ల మేళతాళాలు, గుర్రం మీద గంధం బిందెతో ఊరేగింపు పాతబస్తీ పురవీధుల మీదుగా నిర్వహిస్తామన్నారు. తెల్లవారు జామున మూడు గంటలకు పంజాసెంటర్‌లోఉన్న దర్గా ప్రాంగణానికి చేరుతుందన్నారు. అనంతరం బాబా వారి మహాసమాధి మీద చాదర్ సమర్పిస్తామన్నారు. 20న దీపారాధన ఉంటుందని, 21న బాబావారి దర్గా ప్రాంగణంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో స్వామి వారి శాంతి కల్యాణం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రాహ్మణ వీధిలోని ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయంలోని ప్రత్యేక వేదికపై వేంచేయించారు. అనంతరం మంగళవాయిద్యాలు, పండితుల వ్యాఖ్యానం, అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విష్వక్సేనపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉభయదాతలు కొణిజేటి రమేష్ కాత్యాయిని దంపతులతో పాటుగా పలువురు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, మురళీకృష్ణమాచార్యులు తదితరులు నిర్వహించారు.

నైనవరం ఫ్లైఓవర్‌పై నిలిచిన ట్రాఫిక్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని చనమోలు వెంకట్రావు ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కబేళా వైపు నుంచి వైవీ రావు ఎస్టేట్ వైపు వెళ్తున్న భారీ కంటెయినర్ టైరు గుంతలో పడి పేలిపోయింది. దీంతో కంటెయినర్ ఫ్లైఓవర్ రోడ్డు మధ్యన నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. ఇటు కబేళా వైపు వచ్చే వాహనాలతో పాటు పాలప్రాజెక్టు వైపు వెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరో వైపున వర్షం ప్రారంభం కావడంతో ద్విచక్ర వాహనాలపై చంటి పిల్లలు, కుటుంబాలతో ఉన్న వారి ఇబ్బందులు వర్ణనాతీతం. సుమారు రెండున్నర గంటల పాటు ఇదే పరిస్థితి నెలకొంది. మరో వైపున భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్ జామ్‌పై పలువురు వాహనచోదకులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు.

హిందీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దక్షిణ భారత హిందీ ప్రచార సభ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చారులత హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం కళాశాల సిబ్బంది, విద్యార్థులు చారులతను చిత్రపటం, శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. 2022లో ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. డాక్టర్ చారులత విద్యార్థులకు విశేష సేవలు అందించారని కొనియాడారు. తాను పనిచేసిన మూడు సంవత్సరాలలో తనపై చూపించిన ఆదరాభిమానాలు మరువలేనివని, ఎక్కడ ఉన్నా ఈ కళాశాలలో పనిచేసిన రోజులను మర్చిపోలేనన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం!

- గోతులమయంగా వైవీ రావు ఇన్నర్‌రింగ్
- రెండు నెలలుగా మరమ్మతులే లేవు
- వర్షాలతో మళ్లీ ఫ్లైఓవర్‌పై గోతులు



పాలప్రాజెక్టు ఫ్లైఓవర్ ప్రారంభంలో గోతులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కూటమి పాలనలో నిర్లక్ష్యానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి నగరంలో పలు రహదారులు. నిత్యం వేలాది మంది ప్రయాణించే వైఎస్సార్ కాలనీ సమీపంలోని వైవీ రావు ఇన్నర్‌రింగ్ రోడ్డు, పాలప్రాజెక్టు ఫ్లైఓవర్ గోతులతో ప్రమాదకరంగా మారింది. ఇన్నర్‌రింగ్ వద్ద ఏర్పడిన గోతులను పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానిక వ్యాపారులు రెండు నెలల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. నెలలు గడుస్తున్నా రోడ్డుపై పడిన గోతుల్లో గంపెడు మట్టి వేసిన దాఖలాలు కనిపించలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతులు మరింత ప్రమాదకరంగా మారాయి. గోతుల్లో భారీ వాహనాలు దిగబడిపోయి ప్రమాదాలు బోటు చేసుకుంటున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

దినదిన గండం..

కబేళా నుంచి పాముల కాల్వ చేరే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని కొత్తూరు తాడేపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కబేళా నుంచి వైఎస్సార్ కాలనీ, పాముల కాల్వ మధ్య ప్రయాణం సాగించడమంటే దినదిన గండంగా మారుతోందని పేర్కొంటున్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగించే ఈ మార్గంలో అడుగు అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది.

ఓసారి ఇటురండి సారూ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలోని రోడ్లపై ఉన్న గోతులకు మరమ్మతులు చేపట్టామని చెప్పుకుంటున్న నేతలను ఒకసారి ఈ మార్గంలో ప్రయాణించాలని స్థానికులు కోరుతున్నారు. కబేళా సెంటర్ నుంచి ప్రారంభమయ్యే ఫ్లైఓవర్‌కు అడుగుకో గొయ్యి కనిపిస్తుంది. రెండు నెలలుగా గోతుల మధ్య ప్రయాణం సాగిస్తున్న వాహనచోదకులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లైఓవర్ దిగువన సీఎన్‌జీ బంక్ వద్ద కూడా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం చిన్నవిగా ఉన్న గోతులు వర్షాలకు పెద్దవిగా మారాయి.



పాముల కాల్వకు వెళ్లే మార్గంలో రోడ్డుపై గోతులు



ఇన్నర్ రింగ్ వద్ద ప్రమాదకరంగా..

తరచూ ప్రమాదాలు

ఇన్నర్ రింగ్, పాలప్రాజెక్టు ఫ్లైఓవర్‌పై ఏర్పడిన గోతుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలల వ్యవధిలో సుమారు పదికి పైగా ప్రమాదాలు జరగగా పలువురికి గాయాలైన కేసులు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యాయి. ఇన్నర్ రింగ్‌లో గోతులను పూడ్చడంతో పాటు ప్రమాదాల నివారణకు భారీ వాహనాలను కబేళా మీద నుంచి ఫ్లైఓవర్ మీదగా అనుమతించవద్దని జక్కంపూడి కాలనీతో పాటు విజయవాడ రూరల్ ప్రాంతవాసులు సైతం డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇన్నర్ రింగ్ వద్ద ఇటు పాముల కాల్వ వైపు నుంచి చిట్టినగర్ వైపునకు వచ్చే రోడ్డు, పైపుల రోడ్డు నుంచి పాముల కాల్వ వైపు వెళ్లే రోడ్డులో అడుగు లోతు గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఫ్లైఓవర్ పైనుంచి వచ్చే లారీలు, టిప్పర్లు, కంటెయినర్ల లోడ్ అధిక కావడంతో మలుపు తిరిగే క్రమంలో రోడ్డు దెబ్బతింటోంది.

స్వర్ణాంధ్ర సాకారానికి జీరో పావర్టీ కీలకం



కలెక్టర్‌కు ప్రమాణ పత్రాలు అందజేస్తున్న ఆయా సంస్థల ప్రతినిధులు

కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పీ4 విధానంలో వర్ధమాన్ వికాస్ సంస్థ, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విజయవాడ సెంటర్) భాగస్వాములయ్యాయి. వర్ధమాన్ వికాస్ సంస్థ 500 కుటుంబాలను, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ 74 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరించనున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశను కలిశారు. మార్గదర్శిగా కొనసాగేందుకు తమ ఆసక్తిని తెలియజేస్తూ కలెక్టర్‌కు ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి జీరో పావర్టీ కీలకమని పేర్కొన్నారు. సమాజంలో పేదరికం అనవాళ్లు లేకుండా చేసేందుకు ఆవిష్కృతమైన పీ4లో భాగస్వాములైనందుకు వర్ధమాన్ వికాస్ సంస్థ, బిల్డర్స్ అసోసియేషన్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే జిల్లాలో 6,102 మంది మార్గదర్శులు 53,370 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. కలెక్టర్‌ను కలిసి ప్రమాణ పత్రం అందజేసిన వారిలో వర్ధమాన్ వికాస్ సంస్థ సభ్యులు సీతల్ జైన్, దీక్షిత్ జైన్, దీక్షిత్ చౌహాన్, ప్రవీణ్ జైన్, యోగేష్ జైన్, మోనికా జైన్, ప్రియా జైన్, స్తుతి జైన్, యష్మీ జైన్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ చైర్మన్ జె.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎన్‌టీ వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, వి.వెంకటేశ్వరరావు, ఎన్.నరేంద్ర తదితరులు ఉన్నారు.

సచివాలయాల్లో పునరావాస కేంద్రాల జాబితా

పటమట(విజయవాడతూర్పు): ప్రతి సచివాలయంలో.. సమీపంలోని పునరావాస కేంద్రాల జాబితాను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం గాంధీజీ మహిళా కళాశాల, మోటూరి హనుమంతరావు ప్రభుత్వ పాఠశాల, శ్రీ వెలగపూడి లక్ష్మణ దత్తు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, మామిడికాయల పాకల వద్ద ఉన్న వంగవీటి మోహన రంగా కల్యాణమండపం, రామలింగేశ్వరనగర్‌లోని వీఎంసీ ప్రైమరీ హై స్కూల్లో ఉన్న పునరావాస కేంద్రాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాలని, ప్రతి పునరావాస కేంద్రానికి రేటింగ్ ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రంలో అక్కడ ఉండేట్లు తెలిపే సూచిక బోర్డు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్, మరుగుదొడ్లు, వాటిని సూచించే బోర్డులు, ప్రధానంశాలుగా ఉంచుకొని ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేటట్టు ఈ రేటింగ్ పనికొస్తుందని అధికారులు అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కొండప్రాంతాలవాసులకు ఇళ్లు కేటాయించండి

నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కొండలపై ప్రమాదకర స్థితిలో నివసిస్తున్న వారికి వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్(జేఎన్ఎన్‌యూఆర్ఎం) పథకంలో నిర్మించిన ఇళ్లను కేటాయించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.

సోమవారం ఆయన చిట్టినగర్ ప్రాంతంలో పర్యటించి కొండ ప్రాంతంలో నివసిస్తున్నవారి నుంచి వివరాలను తీసుకున్నారు. తన పర్యటనలో ప్రమాదానికి గురయ్యే ఒక ఇంటిని పరిశీలించి అక్కడ నివసిస్తున్న తేజ -నాగమణితో మాట్లాడారు, వారు ఇల్లు కేటాయిస్తే వెంటనే అక్కడికి వెళ్తామని అంగీకారం తెలపడంతో, టౌన్ ప్లానింగ్, జేడీ అమృత్ సమన్వయంతో వెంటనే ఇంటిని కేటాయించాలని ఆదేశించారు.



కొండప్రాంత వాసుల సమస్యలు తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

నేటి నుంచి పద్య నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సమితి, శ్రీనివాస నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దత్తుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీర్ అంబేడ్కర్, కలియుగ వైకుంఠం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు దాటుతూ ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. భానునగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రాజారావు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో రాజారావును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చిన్న వయస్సులోనే రాజారావు మృతి చెందటంతో భానునగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి వెళ్లిన తన కొడుకు తిరిగి రాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పాయకాపురం కండ్రికలో నివాసం ఉంటున్న షేక్ అబ్దుల్‌షకీలా, అతని కుమారుడు దాదావీర్ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుంటారు. కోడలు మంగళగిరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటుంది. ఈ నెల 17వ తేదీన కోడలితో గొడవ పడిన కుమారుడు ఏపీ 39ఆర్ 2549 యాక్సెస్ బండిపై వెళ్లి తిరిగి రాలేదని, అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం క్వాంటమ్ కంప్యూటింగ్‌పై రెండు రోజుల సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో హైదరాబాద్‌కు చెందిన క్విన్ఫోసిస్ సీఈవో, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వల్లూరి మహేశ్వరరావు మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సైనిక, బ్యాంకింగ్ నెట్‌వర్కు భవిష్యతు సురక్షితంగా ఉంటాయని చెప్పారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నగరంలో విస్తృతంగా తనిఖీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో ఇంటర్ సెప్టర్, యాంటీ నార్కోటిక్, ఈగల్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ కేజీవీ సరిత పర్యవేక్షణలో శక్తిటీం, మహిళా పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు వారి రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగిస్తున్నారు. అనుమానిత ప్రదేశాల్లో నిఘా పటిష్టం చేయడంతో పాటు, ఆయా ప్రదేశాలను తనిఖీ చేస్తున్నారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించే వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు, మత్తు పదార్థాలు సేవిస్తే కలిగే అనర్థాలపై వారికి అవగాహన కలిగిస్తున్నారు. విద్యార్థులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కలిగిస్తూ స్వీయ రక్షణపై శిక్షణ ఇస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పాన్‌షాపులు, బడ్డీకొట్టు తనిఖీ చేస్తూ లేడీస్ హాస్టల్స్ సమీపంలో నిఘా పెంచుతున్నారు.



ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న నిఘా బృందాలు

రక్షిత మంచినీటిపై నిరంతర పర్యవేక్షణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వర్షాలు కురుస్తున్న వేళ ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యంతో పాటు భక్తులకు అందిస్తున్న రక్షిత మంచినీటిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆలయ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి కుళాయిలను, శానిటేషన్‌ను ఈవో సోమవారం పరిశీలించారు. మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నటరాజ స్వామి ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న నూతన పూజా మండపాలను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఎక్కడా వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని శానిటేషన్ సూపర్‌వైజర్లను ఆదేశించారు.



మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

మాతృభాషతో పాటు మరొక భాషలో ప్రావీణ్యం పొందాలి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మాతృభాషతోపాటు మరొక భాషలో ప్రావీణ్యం పొందాలని సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలిత ప్రసాద్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్, నేషనల్ టెస్టింగ్ సర్వీస్-(మైసూరు) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగులో పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నాంశ రచన అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబినార్ హాలులో సోమవారం ప్రారంభమైంది. లలిత ప్రసాద్ మాట్లాడుతూ భావవ్యక్తీకరణ ముఖ్యమన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ కృత్రిమమేధ వినియోగంలోకి వచ్చిన ప్రస్తుత రోజుల్లో సంప్రదాయ పరీక్షలు, మూల్యాంకనం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. సీఐఐఎల్ రిసోర్స్ పర్సన్ ఎం.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రముఖ విద్యాసంస్థలో ఇటువంటి శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రతినిధి డాక్టర్ కె.రవిబాబు మాట్లాడుతూ ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. సిద్ధార్థ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.శివకుమార్, డాక్టర్ సశ్రీ పాల్గొన్నారు. తెలుగు సాహిత్యం అంశంపై ఆంధ్ర లయోల కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు, జాతీయ విద్యావిధానంపై కంచికచర్లలోని ఎస్‌డబ్ల్యూఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె.బాలకృష్ణ మాట్లాడారు. తెలుగు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లలిత ప్రసాద్

కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని, ముంపు నివారణ చర్యలు తీసుకోవాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు 47వ డివిజన్ పరిధిలోని సర్కిల్-1 కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇచ్చారు. అనంతరం కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ పశ్చిమలోని కొండ ప్రాంతాల్లో నివసించే పేదలకు.. రెండు మూడు రోజులు వరసగా వర్షం కురిస్తే చాలు కొండ రాళ్లు జారిపడి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన రిటైనింగ్‌వాల్స్ కూలిపోతున్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలకు నగరానికి రావల్సిన రూ.100 కోట్లు గ్రాంటు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టాం వాటర్ డ్రెయిన్ల నిర్మాణానికి విడుదల చేయాల్సిన రూ.289 కోట్ల బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. రక్షిత మంచినీటి సరఫరాలో దుర్వాసనతో కూడిన రంగుమారిన నీరు వస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండ ప్రాంతాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సూరిబాబు, పశ్చిమ అభివృద్ధి కమిటీ నాయకులు చిన్న గురప్ప, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్కిల్-1 కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సత్యబాబు తదితరులు

వాటర్ పైప్‌లైన్‌పై కల్వర్ట్ నిర్మాణమా..!

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొత్తగా నిర్మిస్తున్న కల్వర్ట్ లోపల మెయిన్ వాటర్ పైప్‌లైన్ ఉంచేసి పైన శ్లాబ్ వేస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత లోపల ఉన్న పైప్‌లైన్ దెబ్బతింటే మరమ్మతులు చేసేందుకు కూడా అవకాశం ఉండదంటున్నారు. వీఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా కట్టుకుంటూ పోతున్నాడని మండిపడుతున్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని వీరయ్య హోటల్ సెంటర్‌లో డ్రెయిన్ నిర్మాణ పనుల్లో భాగంగా కల్వర్ట్ నిర్మిస్తున్నారు. వీరయ్య హోటల్ పక్క వీధిలో నివసిస్తున్న దాదాపు 40 కుటుంబాలకు మెయిన్ వాటర్ పైప్‌లైన్ ద్వారానే మంచి నీటి సరఫరా అవుతుంది. ఆ పైప్‌లైన్‌ను రోడ్‌కు ఒక పక్కగా ఏర్పాటు చేసి కల్వర్ట్ నిర్మించాల్సి ఉండగా దానిపైనే కట్టేయడంపై ఫిర్యాదు చేసినా అటు అధికారులుగానీ ఇటు కాంట్రాక్టర్‌గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్‌లో మెయిన్ వాటర్ పైప్‌లైన్‌లో సమస్య వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కల్వర్ట్ కింద మురుగునీటి మధ్యలో ఉండే పైప్‌లైన్ దెబ్బతింటే తాగునీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ పైప్‌లైన్‌ను బయటపెట్టి కల్వర్ట్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మంచినీటి మెయిన్ పైప్‌లైన్‌ను కల్వర్ట్ లోపల పెట్టి నిర్మిస్తున్న దృశ్యం

ఒడ్డుకు చేరాయి





కృష్ణా నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదిలో తిరిగే పడవలను సోమవారం భవానీ ఘాట్ వద్ద ఒడ్డుకు చేర్చారు. వరద ప్రవాహానికి పున్నమి ఘాట్‌లో ఐరన్ ర్యాంప్ విరిగింది. ఘాట్‌లో మెట్ల పరిసరాల్లో బురద పేరుకుపోయి కనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ